క్లుప్తంగా

జనసేన నేతలతో ప్రాణహాని


మాట్లాడుతున్న బాధితుడు అస్లాం

తిరుపతి కల్చరల్ : అన్నమయ్య జిల్లా మదనపల్లికు చెందిన జనసేన నేతలు దారం హరి, అనిత దంపతులతో తనకు ప్రాణహాని ఉందని బాధితుడు సి.అస్లాం ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్స్ కాంట్రాక్ట్ పనులు ఇప్పిస్తామని హరి దంపతులు తనను మోసం చేశారని ఆరోపించారు. ఈ మేరకు వారి మాటలు నమ్మి అపర్ణ ఓవర్‌సీస్ సంస్థకు రూ.5లక్షల డిపాజిట్ చెల్లించానన్నారు. అలాగే హరి దంపతులకు కమీషన్ కింద రూ.5లక్షలకు గాను తొలి విడతగా రూ.1.5లక్షలు ముట్టజెప్పానని వెల్లడించారు. ఈక్రమంలో వేరే వారికి మంజూరైన పనులను అప్పగించారని, వాస్తవం తెలియక కూలీలను పెట్టి చాలా వరకు పనులు సైతం చేయించినట్లు వాపోయారు. విషయం బయట పడిన తర్వాత తాను వెచ్చించిన మొత్తం రూ.10.5లక్షలను తిరిగి ఇవ్వాలని కోరితే, చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఆకట్టుకున్న ప్రవచనం


ప్రవచనం చేస్తున్న భరత్ శర్మ

తిరుపతి కల్చరల్ : ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నమాచార్య కళామందిరంలో శతావధాని ఉప్పలదండి భరత్ శర్మ నిర్వహించిన లక్ష్మీదేవి మహత్యం ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ప్రవచనకర్తను రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ చేతులమీదుగా సత్కరించారు.

ఆల్జీబ్రాపై ముగిసిన శిక్షణ

తిరుపతి సిటీ : ఆల్జీబ్రా, ఆల్జీబ్రాయిన్ నంబర్ థియరీ, టోపాలజీ అనువర్తనాలపై ఎస్వీయూలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ పరమేశ్వర శంకరన్ ఆధ్వర్యంలో గణితశాస్త్రంలోని పలు అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో కో–ఆర్డినేటర్ జయసుబ్బారెడ్డి, బిజర్ అధ్యాపకులు నాగరాజు, సుభాష్, ప్రొఫెసర్ సుగుణమ్మ, సుధాకరయ్య పాల్గొన్నారు.

సైన్స్‌తో సమాజ పురోగతి


నివాళులర్పిస్తున్న జేవీవీ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : సైన్స్‌తో సమాజ పురోగతి సాధ్యమని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 146వ జయంతి నిర్వహించారు. ఐన్‌స్టీన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శివకుమార్, సురేంద్రబాబు, శాస్త్రవేత్త రామయ్య, కిరణ్ స్కూల్ అధినేత జయరామిరెడ్డి, జేవీవీ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, కార్యకర్తలు రఫీ, లక్ష్మీనారాయణ, బిర్లా నాయుడు, ఓవీ రమణ, కుప్పస్వామి, టెంకాయల దామోదరం పాల్గొన్నారు.

అండగా నిలవాలని వినతి


ఎమ్మెల్సీకి వినతి పత్రం అందిస్తున్న జూడాలు

తిరుపతి సిటీ : గౌరవ వేతనం పెంచాలని 40 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వెటర్నరీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యానికి వినతిపత్రం అందించారు. స్టయిఫండ్ పెంపుదలకు చేపట్టిన పోరాటంలో తమకు అండగా నిలవాలని విన్నవించారు.

సిరులతల్లి సేవలో మంత్రి


ఆలయం వెలుపల మంత్రి రవీంద్ర

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవిని మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం సేవించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో మంత్రి రవీంద్రకు వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

17 'చలో విజయవాడ'

పాకాల : పంచాయతీ ఎంప్లాయాస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన చలో విజయవాడ చేపట్టినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య తెలిపారు. శుక్రవారం పాకాల, దామలచెరువు పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. నేతలు రాము, నాగభూషణం, మురళీమోహన్, ప్రసాద్, గుణశేఖర్‌రెడ్డి, గణేష్, రాజు, మహేశ్వరి, చంద్ర, బాలకృష్ణ, చంగల్రాయులు, మహేష్ పాల్గొన్నారు.

అభినందన



జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో సత్తా చాటిన పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థినులను ప్రిన్సిపల్ నారాయణమ్మ శుక్రవారం అభినందించారు. ఢిల్లీలో కీర్తి పతాక ఎగురవేసిన విద్యార్థినులు ఎస్.దీప్తి, జాస్మిన్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉమారాణి, భువనేశ్వరీదేవి, విద్యుల్లత, జ్యోతి పాల్గొన్నారు.

– తిరుపతి సిటీ

ఆనందం



తిరునగరంలో శుక్రవారం ఘనంగా హోలీ వేడుకలు నిర్వహించారు. ప్రధానంగా చిన్న బజారు వీధి, కొత్త వీధి, కర్నాల వీధి, నెహ్రూ వీధి, బండ్ల వీధిలోని మార్వాడీలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పురవీధుల్లో పిల్లలు.. పెద్దలు ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.

– తిరుపతి కల్చరల్

ఆవేదన



ఎస్వీయూలో పాత వాహనాలు తుప్పపట్టి, విడిభాగాలు అపహరణకు గురవుతున్నా, అధికారులు పట్టించుకోవడంలేదని ఎస్ఎఫ్ఐ నేత అశోక్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్సిటీ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా విలువైన వాహనాలు శిథిలావస్థకు చేరాయని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి వాటిని వేలం వేసి వర్సిటీ అభివృద్ధికి వెచ్చించాలని కోరారు.

– తిరుపతి సిటీ

నగరంలో నేడు

- నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు తారక రామా స్టేడియం నుంచి టౌన్ క్లబ్ వరకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ.
- టీటీడీ పరిపాలన భవనం వద్ద మైదానంలో ఉదయం 9 గంటల నుంచి క్రీడా పోటీలు.
- స్విమ్స్ శ్రీపద్మావతి మెడికల్ కళాశాల, కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో నరసింహ తీర్థం రోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉదయం 9.30 గంటలకు మీజల్స్ ఇమ్యూనైజేషన్‌డే
- పట్నాలు వీధిలోని రేణుకా పరమేశ్వరి అమ్మవారి మహోత్సవాలు ప్రారంభం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, రాత్రి 7 గంటలకు పల్లకీ సేవ
- ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ఉదయం 10 గంటలకు ఆగమ సిద్ధాంతంపై సదస్సు
- ఎస్వీయూ మైదానంలో ఉదయం 8 గంటల నుంచి తిరుపతి డాక్టర్స్ వర్సెస్ జాతీయ సంస్కృత వర్సిటీ జట్ల క్రికెట్ పోటీలు. మధ్యాహ్నం 1.30 నుంచి ఎస్వీయూ వర్సెస్ తిరుపతి పోలీస్ శాఖ జట్ల క్రికెట్ పోటీలు.
- మ్యాంగో మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హర్ష టొయోటా వారి పాత కార్ల ఎక్స్ఛేంజ్ మేళా.
- భవానీనగర్‌లోని గేట్ డిగ్రీ కళాశాలలో ఉదయం 8.30 నుంచి జాబ్ మేళా.
- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళా.
- మానస సరోవర్ హోటల్లో ఉదయం 10 గంటల నుంచి బయోడైవర్సిటీ సంరక్షణపై సమావేశం.

త్రుణం.. తరుణం!

మహిళలకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ కరీముల్లా



ఆధునిక సమాజంలో త్రుణధాన్యాలకు ప్రాధాన్యం పెరిగింది. ఆరోగ్యకర ఆహారపు అలవాట్లలో భాగంగా చిరుధాన్య వంటకాలకు అగ్రపీఠం దక్కింది. ఈ క్రమంలోనే అతివలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఇదే తరుణంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కార్యాచరణ అమలు చేస్తోంది. ఈ మేరకు ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా దళిత మహిళలకు త్రుణధాన్యలతో స్నాక్స్ తయారుచేయడంపై ఉచితంగా శిక్షణ అందించింది. సుమారు 30 మందిని ప్రత్యేకంగా ఎంపిక చేసి మెలకువలు నేర్పించింది. వంటలకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేసింది. అలాగే వివిధ రకాల చిరుతిండ్లను సిద్ధం చేసే ప్రక్రియను వివరించే పుస్తకాలతోపాటు సర్టిఫికెట్‌ను అందజేసింది. ఆడపడుచులు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా బాటలు వేసింది.

- చిరుధాన్యాలతో స్నాక్స్ తయారీపై శిక్షణ
- మహిళల ఉపాధి కోసం మెలకువలు
- ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రత్యేక తరగతులు
- ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా అతివల అభ్యున్నతికి అడుగులు

తిరుపతి సిటీ : ఆరోగ్య పరిరక్షణలో భాగంగా చిరుధాన్యాల వినియోగం అధికమవుతున్న నేపథ్యంలో మహిళలు చిరుధాన్యాలతో స్నాక్స్ తయారు చేసి ఉపాధి పొందే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అందులో భాగంగా బడుగు బలహీన వర్గాల మహిళలను ఆర్థిక స్వావలంబన వైపుగా తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలోనే అఖిల భారత జొన్న మరియు చిరుధాన్యాల సమన్వయ పరిశోధన పథకం ఆధ్వర్యంలో ఎస్సీ సబ్‌ప్లాన్ 2024–25 సహకారంతో చిరుధాన్యాలకు విలువ జోడింపు అనే అంశంపై మహిళా రైతులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసింది. ఈ మేరకు సుమారు 30 మంది ఎస్సీ మహిళా రైతులకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కరీముల్లా ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చింది. అనంతరం వారికి వంట సామగ్రితో ఆహారపదార్థాల తయారీ విధివిధానాల పుస్తకం, శిక్షణ సర్టిఫికెట్లతో కూడిన కిట్‌ను ఉచితంగా అందజేసింది. ఈ సందర్భంగా ఏడీఆర్ డాక్టర్ సుమతి మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు ఇంటివద్దనే పలురకాల పదార్థాలను తయారు చేసి ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్థిరపడవచ్చని సూచించారు.

మెలకువలు నేర్చుకున్నాం



చిరుధాన్యాలతో పలు రకాల స్నాక్స్ తయారీలో మెలకువలు నేర్చుకున్నాం. తక్కువ ఖర్చుతో సులువుగా బిస్కెట్ల తయారీపై నిపుణులైన సిబ్బందితో మంచి శిక్షణ ఇచ్చారు. రాగి, జొన్న బిస్కెట్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఆర్ఏఆర్ఎస్ సహకారంతో ఇంటి వద్దే బిస్కెట్లను తయారు చేసే ప్రక్రియను ప్రారంభిస్తాం.

– ఎస్.శారద, అనురాధ

ఉత్తమంగా శిక్షణ



ఆరోగ్య పరిరక్షణలో చిరుధాన్యాల పాత్ర కీలకం.ప్రస్తుతం ప్రజలు చిరుధాన్యాల ఆహార పదార్థాలపై మక్కువ చూపుతున్నారు. మేము వృత్తి రీత్యా రైతులం. ప్రధానంగా జొన్న, సజ్జ, రాగితో చేసిన బిస్కెట్లు, మరమరాలు వంటివి చిన్నపిల్లలతోపాటు పెద్దలకు సైతం నోరూరిస్తుంటాయి. అలాంటి వాటి తయారీపై ఆర్ఏఆర్ఎస్‌లో ఉత్తమంగా శిక్షణ అందించారు.

– నళిని, జ్యోతిలక్ష్మి

ఎంతో ఉపయోగకరం



మేము చిరుధాన్యాలు పండిస్తాం కానీ, వాటిని ఇలా స్నాక్స్ రూపంలో తయారు చేసే విధానం తెలియదు. ఈ క్రమంలోనే త్రుణధాన్యాల నుంచి అధిక రాబడి పొందేందుకు పలు రకాల స్నాక్స్ తయారీపై శిక్షణ ఇచ్చారు. ఆర్థికంగా నిలబడేందుకు శిక్షణ ఎంతో ఉపయోగకరం. మేము మరమరాలు, రిబ్బన్ల తయారీలో నైపుణ్యం సాధించాం.

– దేశమ్మ, అలిమేలు

ప్రోత్సాహం మరువలేం



చిరుధాన్యాలతో స్నాక్స్ తయారీపై గ్రామీణ మహిళా రైతులకు శిక్షణ అందించడం అభినందనీయం. మాకు వంట సామగ్రి కిట్‌ను ఉచితంగా అందజేశారు. ఆర్ఏఆర్ఎస్ అధికారుల ప్రోత్సాహం మరువలేం. ఆరోగ్యంతో పాటు ఆదాయం ఆర్జించే విధానాలపై మాకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. చక్కగా శిక్షణ ఇచ్చారు.

– రాజీ, నూర్జహాన్

ఇదే సరైన సమయం



చిరుధాన్యాలతో చేసిన పిండి వంటలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉంది. మహిళలు ఇందులో నైపుణ్యం సాధిస్తే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇదే సరైన సమయం. అందుకే చిరుధాన్యాలకు విలువ జోడింపుపై ప్రత్యేకంగా శిక్షణ అందించాం. సొంతంగా స్నాక్స్ తయారు చేసుకుని విక్రయించుకునేలా తీర్చిదిద్దాం. – డాక్టర్ కరీముల్లా, ప్రధాన శాస్త్ర వేత్త, ఆర్ఏఆర్ఎస్

గాల్లో దీపంలా పేదల ఆరోగ్యం

తిరుపతి తుడా : కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యం గాల్లో దీపంలా మారిందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ విమర్శించారు. శుక్రవారం స్విమ్స్ ఆస్పత్రి వద్ద కాంగ్రెస్ నేతలతో కలిసి ధర్నా నిర్వహించారు. చింతా మోహన్ మాట్లాడుతూ స్విమ్స్, రుయా ఆస్పత్రుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. స్విమ్స్‌ను ఆదుకోలేమని టీటీడీ చైర్మన్ ప్రకటించడం సరికాదని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి స్విమ్స్, రుయాకు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీగౌడ్, రవి, తేజోవతి, ముని శోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

సీతమ్మ భూముల రక్షణే లక్ష్యం

తిరుపతి కల్చరల్ : పంగులూరి సీతమ్మ భూముల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని శ్రీవాసవీ సత్ర సముదాయం ప్రధాన కార్యదర్శి ఇ.లక్ష్మయ్య, కాశీ సత్రం ప్రధాన కార్యదర్శి విలాస్ బచ్చు తెలిపారు. శుక్రవారం కపిలతీర్థం రోడ్డులోని శ్రీవారి సన్నిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ, కార్యదర్శిగా మహేష్, కోశాధికారి శిరీష తమ కుటుంబీకులకు సీతమ్మ భూములు లీజుకు ఇచ్చారని ఆరోపించారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎండోమెంట్ కమిషనర్ చర్యలు తీసుకుని వారిని ధర్మకర్తల మండలి నుంచి తొలగించారని వెల్లడించారు. ఈ క్రమంలో వెంటనే నూతన కమిటీని ఏర్పాటు చేసి సీతమ్మ భూములను పరిరక్షించాలని కోరారు. సమావేశంలో ఆర్యవైశ్య ప్రతినిధులు మిట్టా లోకేష్, పసుపర్తి గోపీనాథ్, జక్కా సుబ్బరాజు, దేవికీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఖరిపై నిరసన

తిరుపతి కల్చరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక సంఘాల నేతలు నిరసన తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు వేణుగోపాల్, ఎన్‌డీ రవి, బాలసుబ్రమణ్యం, రాధాకృష్ణ, మురళి, శివ, కేవై రాజా, బాబు, శ్రీనివాసులు, వెంకటేష్, చిన్నం పెంచలయ్య, నాగరాజు, చలపతి, రామకృష్ణ పాల్గొన్నారు.

రుయా ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా మధుసూదన్

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఆర్థో విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభు సెలవుపై వెళ్లడంతో ఆయన ఇన్‌చార్జిగా నియమితులయ్యారు.

క్రీడారంగంపై ప్రత్యేక దృష్టి

తిరుపతి తుడా : క్రీడా రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం గొల్లవాని గుంటలోని క్రికెట్ మైదానంలో చేపట్టిన అభివృద్ధి పనులను శాప్ చైర్మన్ రవి నాయుడు, కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మైదానం పనులు దాదాపు పూర్తయినట్లు వెల్లడించారు.

నేడు విజయవాడలో ఎస్ఎఫ్ఐ దీక్ష

తిరుపతి సిటీ : విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ నేతలు వెల్లడించారు. శుక్రవారం ఈ మేరకు ఎస్వీయూ ఎదుట ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి వినోద్‌కుమార్, వెటర్నరీ జూడాలు నీలిమ, పవన్ కుమార్ మాట్లాడుతూ గౌరవ వేతనం పెంచాలంటూ 40 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ తక్షణమే ఫీజు బకాయిలు చెల్లించాలని, ఏపీ పీజీసెట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు తేజ, పి.నక్వర్ ఖాన్, ఎజ్రా, ప్రవీణ, భాస్కర్, తిరుమలేష్ పాల్గొన్నారు

ఎంసెట్ శిక్షణకు పరీక్ష రేపు

తిరుపతి సిటీ : భవానీ నగర్, రాజన్న పార్క్ సమీపంలోని శ్రీగగన కోచింగ్ సెంటర్‌లో రెండు నెలలపాటు ఎంసెట్ ఉచిత శిక్షణ కోసం ఆదివారం ఉదయం 9 గంటలకు మౌఖిక పరీక్ష నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ కరుణామూర్తి శుక్రవారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 9553590099, 9553490099 నంబర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ ఈఓ సస్పెన్షన్

చంద్రగిరి: లంచం తీసుకుంటూ ఏసీబీకు పట్టుబడిన చంద్రగిరి పంచాయతీ ఈఓ మహేశ్వరయ్యను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పంచాయతీ రాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు ఆదేశాలు జారీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 28వ తేదీన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ బిల్లుల మంజూరులో ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలను జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులకు ప్రతులను పంపించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పాకాల: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గుండ్లగుట్టపల్లి వద్ద చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు కథనం.. పాకాల మండలం, తురకపల్లి గ్రామానికి చెందిన నవాబ్‌బాషా(51) గుండ్లగుట్టపల్లి బస్‌స్టాప్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై పీలేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీ వేగంగా వచ్చి నవాబ్‌బాషాను ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సుదర్శనప్రసాద్, ఎస్ఐ సంజీవరాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కవితా సంపుటి ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్ : టీటీడీ విశ్రాంత ఇంజినీర్ తోట వెంకటేశ్వర్లు రచించిన కవితా సంపుటి «తమసోమా జ్యోతిర్గమయ» పుస్తకాన్ని శుక్రవారం యూత్ హాస్టల్‌లో ఎస్వీయూ పూర్వ ఆచార్యుడు గార్లపాటి దామోదరం నాయుడు ఆవిష్కరించారు. ఈమేరకు విశ్రాంత ఆచార్యుడు మేడిపల్లి రవికుమార్ సమీక్షించారు. కార్యక్రమంలో ఆచార్య ఎస్‌జీ డీ.చంద్రశేఖర్, రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద , సాహితీ వేత్తలు మల్లేశ్వరరావు, సాకం నాగరాజు, నాదేళ్ల శ్రీమన్నారాయణ, జిల్లేళ్ల బాలాజీ, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆర్‌సీకే రాజు, టెంకాయల దామోదరం, జయరామ్ ప్రసాద్, జీఎస్ ప్రసాద్, న్యాయవాది రాజగోపాల్, గజేంద్రరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో అతిథులు, సాహితీ వేత్తలు

తిరుమలలో కట్లపాము

తిరుమల : తిరుమలలోని బాలాజీ నగర్ 5వ లైన్‌లోకి శుక్రవారం ఓ కట్లపాము ప్రవేశించింది. స్థానికులు వెంటనే స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడుకు సమాచారం అందించారు. ఆయన వెంటనే అక్కడకు చేరుకుని చాకచక్యంగా పామును పట్టుకున్నారు. సురక్షితంగా అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.


పామును చూపుతున్న భాస్కర్ నాయుడు

విశ్రాంత ప్రొఫెసర్ కన్నుమూత

తిరుపతి సిటీ : ఎస్వీయూ రాజనీతి శాస్త్రం విభాగపు విశ్రాంత ప్రొఫెసర్ బి.వెంకట చలపతి శుక్రవారం కన్నుమూశారు. కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన ఆయన స్విమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

తిరుపతి కల్చరల్ : టీటీడీ పరిపాలన భవనం వెనుక వైపు ఉన్న మైదానంలో శుక్రవారం టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. షటిల్ డబుల్స్‌లో రమాదేవి, నీలిమ జట్టు విజయం సాధించగా, దేవి, దామర సెల్వి జట్టు రన్నరప్‌గా నిలిచింది. సింగిల్స్‌లో రమాదేవి విజయం సాధించగా, మాధవి రన్నర్‌గా నిలిచారు. పురుషుల షటిల్ డబుల్స్‌లో గోవిందరాజన్, సురేంద్ర జట్టు విజేతగా, వెంకటేశ్వర్లు, పార్థసారథి జట్టు రన్నర్ స్థానాలు కైవసం చేసుకుంది. సింగిల్స్‌లో సురేంద్ర విజయం సాధించగా, వెంకటేశ్వర్లు రన్నర్‌గా నిలిచారు. మహిళా ఉద్యోగుల డాడ్జ్ బాల్ సింగిల్స్‌లో కె.పద్మజ విజయం సాధించగా, పి.పద్మజ రన్నర్‌గా నిలిచారు.

పాత కార్ల మెగా ఎక్స్ఛేంజ్ మేళా

తిరుపతి కల్చరల్ : హర్ష టొయోటా తిరుపతి శాఖ ఆధ్వర్యంలో మ్యాంగో మార్కెట్ యార్డ్ ఎదురుగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న పాత కార్ల మెగా ఎక్స్ఛేంజ్ మేళాను శుక్రవారం ఆర్టీఓ కె.మురళీమోహన్ ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హర్ష టొయోటా ఉపాధ్యక్షుడు వైబీ స్వామి, సీనియర్ సీఎంఎల్ సాయిబాబా ముఖేష్, ఏజీఎం శివకోటి, సేల్స్ మేనేజర్ వై.శ్రీకాంత్ , కె.శరత్, జి.సుభాష్ చౌదరి, క్లాస్1 కాంట్రాక్టర్ సి.కృష్ణమనాయుడు,వి.సురేంద్ర నాయుడు, టీడీపీ నేత రవి నాయుడు పాల్గొన్నారు.